క్లుప్తంగా

రేపు జాబ్ మేళా

ఖమ్మం స్పోర్ట్స్: నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. ఖమ్మం శ్రీశ్రీ సర్కిల్ రోడ్డులోని ఏఅండ్‌ఎల్, సూపర్ టొయోటా షోరూంల్లో జరిగే జాబ్‌మేళాలకు పదో తరగతి ఆపై విద్యార్హత ఉన్న వారు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.

సంజీవరావుకు సేవారత్న అవార్డు


సంజీవరావు

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహాసేన జిల్లా అధ్యక్షుడు మందా సంజీవరావు విశిష్ట సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 27న గోవాలో జరగనున్న సమావేశంలో ఎస్ఎస్‌బీఎం మహాసేన సంస్థ బాధ్యులు ఆయనకు అవార్డు అందజేస్తారు. ఈమేరకు మహాసేన జాతీయ అధ్యక్షుడు అనిల్‌కుమార్ నుంచి లేఖ అందిందని సంజీవరావు తెలిపారు.

పాలేరు పాఠశాల అప్‌గ్రేడ్

కూసుమంచి: మండలంలోని పాలేరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఈ విద్యాసంవత్సరం నుంచిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఈమేరకు స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఏ.శ్రీదేవసేన గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విద్యాసంవత్సరం నుంచి తెలుగుమీడియంలో పదో తరగతి వరకు బోధించనున్నారు. గతంలో 7వ తరగతి వరకు ఉండగా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఒక్కో తరగతి పెంచుతూ వచ్చారు. ప్రస్తుతం 266 మంది విద్యార్థులు ఉన్న నేపథ్యాన పదో తరగతికి అనుమతి ఇవ్వడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

15 నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు

నేలకొండపల్లి: ముఖ్యమంత్రి కప్-2023లో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.జమలారెడ్డి తెలిపారు.గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేందుకు 15 నుంచి 36 ఏళ్ల వయస్సు గలవారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను పంచాయతీ కార్యాలయంలో 12వ తేదీ సాయంత్రం లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ క్రీడాపోటీల్లో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అంశాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు.

దిష్టిబొమ్మ దహనం

ఖమ్మం మామిళ్లగూడెం: రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాదికి జిల్లా అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడం దారుణమని బీజేపీ మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు షేక్ పాషా అన్నారు. గురువారం జెడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి నిరసనగా జిల్లా అధికారి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమీక్ష నిర్వహించినట్లయితే మైనారిటీల సమస్యలుతెలిసేవన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ మోర్చా రాష్ట్రకార్యవర్గ సభ్యుడు షేక్.షరీఫుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు మస్తాన్, వివిధ కుల సంఘాలు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కస్టడీ
వినోద	విరూపాక్ష
సాయిరాం	రామబాణం
ఆదిత్య	ఉగ్రం
శ్రీనివాస	కేరళ స్టోరీ
సుందర్	కథ వెనుక కథ

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	24	బచ్చలికూర	2
వంకాయ	20		10
బెండకాయ	18	పాలకూర	3
పచ్చిమిర్చి	50		20
కాకర	40	చుక్కకూర	2
సోరకాయ	16		10
బీర	36	తోటకూర	2
దొండ	28		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీప్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		15
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	46		15
క్యాప్సికం	50	-ఖమ్మం వ్యవసాయం	

ఆహ్లాదమా.. నీవెక్కడ!

పాలేరులో అధ్వానంగా పార్కులు

- నిధులు లేక మౌలిక సదుపాయలు కరువు
- పార్కులను మూసేసిన పర్యాటక శాఖ
- అలంకారప్రాయంగా మారిన వైనం
- సెలవుల్లోనూ దూరంగా ఆహ్లాదం
- పట్టించుకోని అధికార యంత్రాంగం


అలంకార ప్రాయంగా మారిన బోటు

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్ ప్రాంతం ఒకప్పుడు పర్యాటకులతో కళకళలాడేది. కానీ నేడు ఆహ్లాదాన్ని పంచే పార్కులకు పర్యాటక శాఖ శీతకన్ను వేయడం, ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవటంతో పార్కులకు తాళాలు వేశారు. దీంతో అవి కళావిహీనంగా మారి పర్యాటకుల రద్దీ తగ్గడంతో పాటు ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది. ప్రస్తుతం వేసవి సెలవులు కావటంతో పిల్లలు, పెద్దలు పార్కులకు వెళ్దామన్నా.. అవి అలంకారప్రాయంగా మారడంతో కనీసం అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

నాడు ఆహ్లాదకరం..

ఒకనాడు పాలేరులో అందమైన పార్కులతో పాటు రిజర్వాయర్‌లోని ఆహ్లాదకర వాతావరణం, పార్కుల్లోని పచ్చదనం.. పిల్లగాలులు పర్యాటకులను మైమరిపించేవి. పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేకంగా నిర్మించిన పార్కులో పిల్లలతో ఎప్పుడూ రద్దీగా ఉండేది. రానురాను పార్కులు నామ రూపాలు లేకుండా పోయాయి. ప్రస్తుతం తాళం వేసే పరిస్థితికి చేరుకున్నాయి.

నిధులు లేక, రూపు మారక..

పాలేరు పార్కులకు వచ్చే పర్యాటకులకు నిరాశే ఎదురవుతోంది. పార్కులకు వచ్చే వారు సేదతీరేందుకు పచ్చని చెట్లు కూడా కరువయ్యాయి. రిజర్వాయర్‌లో బోటింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన జెట్టి (వంతెన) కూడా విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. అలాగే రిజర్వాయర్‌లోని బోట్లు మూలన పడి దర్శనమిస్తున్నాయి. ఫౌంటేన్‌లు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. కాగా, పర్యాటక శాఖ గతంలో పార్కుల అభివృద్ధి చేయాలని పాలేరు గ్రామపంచాయతీకి అప్పగించగా నాడు విడుదలైన రూ.3లక్షలతో అరకొరగా అభివృద్ధి పనులు చేశారు. కనీసం ఈ నిధులైనా ఈ ఏడు కేటాయించితే కొంతమేరకైనా తీర్చిదిద్ది పూర్వవైభవాన్ని తీసుకురావొచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


విరిగిన జెట్టి (వంతెన)


మూసివేసిన పాలేరు పార్కు ప్రధానం ద్వారం

ఆదాయం కోల్పోతున్నాం..

ఒకప్పుడు పాలేరు పార్కులు, బోటింగ్ చేయడానికి జనం బాగా వచ్చేవాళ్లు. దీంతో ఆదా యం కూడా వచ్చేది. కానీ ఇప్పుడు అవేవి లేకపోవడంతో జనం రాక ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది. పార్కులు బాగు చేస్తే పర్యాటకులు, మాకు సంతోషం.

– బత్తుల ఉప్పయ్య, బోట్‌రైడర్

పార్కుల బాగుకు చర్యలు..

పాలేరులో పార్కులు బాగుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఉన్న పార్కులకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాం. నిధులు కేటాయించగానే పార్కుల అభివృద్ధి చేపడతాం.

– కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ

ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదు..

నేలకొండపల్లి: సంపూర్ణ ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదని నేలకొండపల్లి ఎస్సై జి.స్రవంతి పేర్కొన్నారు. మండలంలోని నాచేపల్లి గ్రామంలో కల్వరి మాట ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం ఆమె ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ముందుకు వస్తున్న వారిని ప్రత్యేకంగా అభినందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కల్వరి మాట వ్యవస్థాపకుడు, గ్రామీణ వైద్యుడు అబ్రహం, సర్పంచ్ మండడి రాజేష్, ఎంపీటీసీ బాబూరావు, పంచాయతీ కార్యదర్శి నాగమణి, పాస్టర్ల అసోసియేషన్ డివిజన్ నాయకులు వడ్లమూడి వెంకటేశ్వర్లు, వైద్యులు శ్రావణి, భరత్‌కుమార్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై స్రవంతి

మక్కలు మార్క్‌ఫెడ్ కొనాలి


రైతులతో మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు

తిరుమలాయపాలెం: మొక్కజొన్నలను మార్క్‌ఫెడ్ వెంటనే కొనాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని తిమ్మక్కపేట గ్రామాన్ని సందర్శించి మొక్కజొన్న రైతులతో మాట్లాడారు. రహదార్లపై మక్కలు ఆరబెట్టుకోవడం, అకాల వర్షాలు వచ్చినప్పుడు కాపాడుకోవడం.. ఇలా పడరాని పాట్లు పడుతున్నారని తెలిపారు.మొక్కజొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవటంతో దళారులు దగా చేస్తున్నారని ఆరోపించారు.తక్షణమే ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాములు, పత్తి నాగేశ్వరారావు, జి.మోహన్, బత్తుల రమేష్, సతీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాల్సిందే..

తిరుమలాయపాలెం: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాల్సిందేనని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు షేక్. బషీరుద్దీన్ అన్నారు. గురువారం కార్యదర్శులకు సీపీఎం మండల కమిటీ మద్దతు తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగటి సురేష్, కొమ్ము శ్రీను, సతీష్, సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులు సరికావు..

నేలకొండపల్లి: పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం బెదిరించే దోరణి మానుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి సూచించారు. గురువారం సీపీఎం ప్రతినిధి బృందం ఎంపీడీఓ కె.జమలారెడ్డికి వినతిపత్రం సమర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించి సమ్మెను విరమించేలా చొరవ తీసుకోవాలని, వారి న్యాయమైన సమ్మెకు పార్టీ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, ముక్తరపు రత్నకిషోర్, తెల్లమేకల శేషుబాబు, పి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణను ఆపాలి


వినతిపత్రం ఇస్తున్న బీవైఎస్ నేతలు

ఖమ్మంమామిళ్లగూడెం: శ్రీకృష్ణుని వేషధారణలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని నగరంలోని లకారంచెరువు వద్ద ఈ నెల 28న ఆవిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారని, అట్టి విగ్రహావిష్కరణను నిలుపుదల చేయాలని భారత యాదవ సమితి (బీవైఎస్) ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తిని దేవుని రూపంలో ఆరాధించడం ప్రజల మనోభావాలను దెబ్బతీస్తుందన్నారు. రామారావు అసలు రూపంలో ఉన్న విగ్రహాలను పెట్టి ఆయన కృషిని, సేవలను కొనియాడడం సముచితం అని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నాగేష్‌యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధి రమేష్‌యాదవ్, లీగల్ అడ్వైజర్ బొగ్రాజ్ శ్రీనివాస్ యాదవ్, శ్రీఆదిభట్ల శ్రీకళాపీఠం వ్యవస్థాపకులు కరాటే కల్యాణి యాదవ్ ఉన్నారు.

నగర విశ్వబ్రాహ్మణ ఎన్నికలు వాయిదా..

ఖమ్మం మామిళ్లగూడెం: ఈ నెల 28న నిర్వహించతలపెట్టిన నగర విశ్వబ్రాహ్మణ సంఘ ఎన్నికలను అదేరోజు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ఉన్నందున వచ్చే నెల 4వ తారీకున వాయిదా వేస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొల్లెటి కృష్ణమాచారి, జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరావు, తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ఆహ్వాన సంఘం చైర్మన్ విజయగిరి సదానందచారి, ఎన్నికల అధికారి విశ్వనాథుల పాపాచారి తెలిపారు. గురువారం గాంధీచౌక్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ రాజేశ్వరావు, ప్రధాన కార్యదర్శి మామిళ్లపల్లి నాగేశ్వరావు, కోశాధికారి కోటగిరి నాగేశ్వరావు, సహాయకార్యదర్శి సోమ నాగరాజుకుమార్, సోమేశ్వరచారి, సత్యనారాయణ, గురుబ్రహ్మం, సువర్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో శాంతి కల్యాణం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని వెంకటగిరి గేటు, సుగ్గలవారి తోటలో ఉన్న శ్రీ రామ సాయి జ్ఞాన మందిరంలో శ్రీ కోదండరామ స్వామి, సీత, లక్ష్మణ్, హనుమాన్ విగ్రహ పునఃప్రతిష్ట, శ్రీ రామలింగేశ్వర స్వామి, నందీశ్వర ప్రతిష్ఠ మహోత్సవాల సందర్భంగా గురువారం శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని ప్రత్యేక పూజలు చేయగా.. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆంజనేయ విగ్రహావిష్కరణ


విగ్రహావిష్కరణలో ఈఓ దంపతులు, పండితులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఘాట్ రోడ్‌లో దేవస్థానం కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు తల్లిదండ్రులు రాధాకృష్ణ, సత్యవతి జ్ఞాపకార్థం ప్రతిష్ఠించిన శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. రూ.లక్ష వ్యయంతో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని వేద పండితులు సీతారామ చార్యులు ఆధ్వర్యంలో ఈఓ జగన్మోహన్‌రావు, రజినీకుమారి దంపతులు, కుమార్తె నాగస్రవంతిలచే పూజలు చేయించి స్తంభాద్రి ఆలయ ప్రధాన అర్చకులు నరహరి నర్సింహాచార్యులు, రామకృష్ణాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రాధాకృష్ణ తదితరుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహావిష్కరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

ఆంజనేయ స్వామి శోభయాత్ర..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ చైతన్యనగర్‌లోశ్రీరామ భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆంజనేయస్వామి వారి శోభయాత్రను ఘనంగా నిర్వహించారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో స్వామి వారిని ఊరేగిస్తూ కోలాటం, డప్పు ప్రదర్శన చేశారు.

గ్రామ దేవతల ప్రతిష్ఠ


పూజలో పాల్గొన్న జెడ్పీచైర్మన్, తదితరులు

కామేపల్లి (కారేపల్లి): కామేపల్లి మండలపరిధిలోని బాసిత్‌నగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన గ్రామదేవతలు ముత్యాలమ్మ, బొడ్రాయిలను దర్శించుకొనగా.. ముత్యాలమ్మ ఆలయం వద్ద గ్రిల్స్ ఏర్పాటుపై చైర్మన్‌తో గ్రామపెద్దలు ప్రస్తావించగా.. గ్రిల్స్ వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బాలు, ఎంపీపీ రాందాస్, మాజీ సర్పంచ్ అరెం రవి, నాయకులు ఫత్తేమహ్మద్, భద్రు, రామ్మూర్తి, నాగేశ్వరరావు, ఉపేందర్, వెంకన్న, సైదులు తదితరులు పాల్గొన్నారు.

దృష్టి లోపాన్ని అశ్రద్ధ చేయొద్దు

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్


కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

ఖమ్మంమయూరిసెంటర్: దృష్టి లోపాన్ని ప్రతి ఒక్కరూ అశ్రద్ధ చేయొద్దని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. గురువారం నగరంలోని 58వ డివిజన్ రాపర్తినగర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపం ఉన్న వారిని గుర్తించి అవసరమైన చికిత్సలు అందించడంతో పాటు రీడింగ్, ప్రిస్క్రిప్షన్ కళ్లజోళ్లను పంపిణీ చేస్తారని తెలిపారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే ఈ అవకాశాన్ని నగర ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.మాలతీ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ రాంబాబు, వైద్యులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఏపీఆర్‌ఓ..

ఖమ్మం జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో సహాయ పౌర సంబంధాల అధికారిగా పనిచేస్తున్న వల్లోజి శ్రీనివాసరావుకు అదనపు పౌర సంబంధాల అధికారిగా పదోన్నతి పొందిన సందర్భంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను గురువారం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి మొక్కను అందజేశారు.

జర్నలిస్ట్ కుటుంబానికి అండగా ఉంటా..

ఖమ్మం సహకారనగర్: బ్రెయిన్ స్ట్రోక్‌తో గత రెండు రోజులుగా నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీడియో జర్నలిస్ట్ గణేష్ కుటుంబానికి తాను అండగా ఉంటానని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఆయన చికిత్సకు అయ్యే ఖర్చంతా తానే భరిస్తాననిచెప్పారు. దీంతో టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, ప్రశాంత్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, శెట్టి రజనీకాంత్ హర్షం వ్యక్తం చేశారు.

కాటి కాపరుల ఔదార్యం


ఆహార పొట్లాలు, పండ్లు అందిస్తున్న కాటికాపరులు

ఖమ్మం మామిళ్లగూడెం: త్రీటౌన్‌లోని కన్యకపరమేశ్వరీ ఆలయం ఎదుట భిక్షటన చేస్తున్న వారికి కాటి కాపరుల ఆధ్వర్యంలో గురువారం భోజనంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాటికాపరుల జాంబవంతుడు, సొసైటీ ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి బాబు మాట్లాడుతూ.. నగరంలోని వైకుంఠధామాలలో పనిచేసే తమకు ఇళ్ల అద్దెకు ఇవ్వటం లేదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి అంత్యక్రియలు నిర్వహించి తమకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పంది వేణు, సైదులు, కాశయ్య, పడిశాల వీరస్వామి, చుక్కయ్య, ఏపురి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన జెడ్పీ సీఈఓ


మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఈఓ

ఖమ్మం సహకారనగర్: ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర గిరిజనాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను జెడ్పీ సీఈఓ వీ.వీ. అప్పారావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బుధవారం జెడ్పీ గెస్ట్ హౌస్‌లో ఆమెకు అల్పాహారం అందించారు.

కూలి పెంచాలి..

ఖమ్మం మామిళ్లగూడెం: నిత్యావసర వస్తువుల పెరుగుదలను బట్టి సుతారి కార్మికుల కూలి రేట్లను పెంచాలని మహాజన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవరావు డిమాండ్ చేశారు. గురువారం శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలి రేట్లు యాథాతథం అని కొందరు చెబుతున్న మాటలకు వాస్తవాలు కావన్నారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి వీరేశం, మహాజన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బండి రవి, ఐఎన్‌టీయూసీ కార్యదర్శి మహబూబ్, దుంపల కుమార్‌స్వామి, మరియన్న, బాషా, అంజి, హుస్సైన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గాయాలు

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయికి చెందిన గణేష్ విద్యుత్ షాక్‌కు గురై తీవ్రగాయాల పాలయ్యాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేసే క్రమంలో ఫ్యూజ్ వైర్ మారుస్తుండగా విద్యుత్ సరఫరా అయింది. దీంతో ఆయన చేతులకు తీవ్ర గాయాలు కాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: నగరంలోని రామన్నపేట వద్ద ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొట్టగా ముగ్గురు గాయపడిన ఘటనపై ఖమ్మం అర్బన్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఖమ్మం ప్రకాష్‌నగర్‌కు చెందిన ఆర్మీ కానిస్టేబుల్ గొడ్ల సురేష్ ఈనెల 6న ద్విచక్రవాహనంపై రామన్నపేటకు వెళ్తుండగా ఆటో ఢీకొట్టింది. ఈఘటనలో సురేష్, ఆయన కుమార్తె ప్రవస్తిశ్రీ,, భార్య సుమలత గాయపడ్డారు. దీంతో సుమలత గురువారం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బీఎస్పీతోనే బహుజన రాజ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: బీఎస్పీతోనే బహుజన రాజ్యం సాధ్యమవుతుందని బీఎస్పీ ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జ్ అయితగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ తెలంగాణ భరోసా యాత్ర మాయావతి బహిరంగ సభను విజయవంతం చేయటం పట్ల కార్యకర్తలకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. దళిత ముఖ్యమంత్రి మాయావతి పథకాలను కాపీ కొట్టి దళితులకు మూడు ఎకరాల భూమి, దళిత బంధు వంటి పథకాలు ప్రవేశపెట్టారని, కానీ తనలో ఉన్న ఆధిపత్య కుట్ర మాత్రం ఆ పథకాలను నీరుగార్చేలా చేశాయన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర నాయకులు దామళ్ల సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలం గట్టు పంచాయితీలో ఘర్షణ

ఇద్దరిపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: నగరంలోని కై కొండాగూడెంలో పొలం గట్టు వద్ద ఇరువర్గాలు ఘర్షణ పడిన ఘటనపై ఇద్దరిపై కేసు నమోదైంది. ఖమ్మం అర్బన్ పోలీసుల కథనం ప్రకారం.. టి.ఉపేందర్, సోదరుడు బలరాం బుధవారం తమ పొలానికి ఫెన్సింగ్ వేయిస్తున్న క్రమంలో పక్క పొలానికి చెందిన భీముడు, రమేష్ వచ్చి తమతో ఘర్షణ పడ్డారు. దీంతో దాడి చేసి హత్యాప్రయత్నానికి పాల్పడినట్లు ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎస్సెస్సీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో నిర్మల్ హృదయ్ యాజమాన్యం, ప్రిన్సిపాల్


బీబీఎం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

నిర్మల్ హృదయ్..

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని ఖమ్మంలోని నిర్మల్ హృదయ్ పాఠశాల కరస్పాండెంట్ వంగా సాంబశివారెడ్డి తెలిపారు. వి.ధరణి 10 జీపీఏ, ఎస్.కే.సమీర్ అహ్మద్ 9.8, మరో తొమ్మిది మంది 9.7 జీపీఏ సాధించగా, మొత్తంగా 123మందిలో 122మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్ వంగా సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఏ.పద్మజ, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీ భాష్యం..

పది ఫలితాల్లో తమ విద్యార్థులు మంచి గ్రేడ్లు సాధించారని శ్రీభాష్యం హైస్కూల్ యాజమాన్యం తెలిపింది. 9.8 జీపీఏ సాధించిన వారిలో బి.రోహిత్ గని, పి.హారిణి, పి.మనస్వీ, సీహెచ్.వర్షిక, టి.వాసవిలు ఉండగా.. చాలామంది విద్యార్థులు మంచి గ్రేడ్లు సాధించారని చెప్పారు.

బీబీఎం..

ఖమ్మంరూరల్: పది ఫలితాల్లో మండలంలోని నాయుడుపేటలో ఉన్న భారత్ బాలమందిర్(బీబీఎం) ఉన్నత పాఠశాల చెందిన డి.రక్షిత, బి.వినోద్, బి.రవితేజ, బి.గోపీచంద్ 10జీపీఏ, ఇ.కీర్తి, షణ్ముఖ్ 9.8 జీపీఏ సాధించారని పాఠశాల చైర్మన్ కాంతారావు తెలిపారు. ఇక 26 మందికి పైగా విద్యార్థులు 9 జీపీఏ సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను చైర్మన్‌తో పాటు కరస్పాండెంట్ నాగమణి, ఉపాధ్యాయులు అభినందించారు.